# అందముండేది చూసేవారి కళ్ళలో



" గృహిణ్యాః మహా నసకర్మలగ్న
మసీ మలినతేన హస్తేన
స్పృష్టం ముఖం హాసతే
చంద్రావస్థాంగతం పత్యా

**భావం:** వంటింటి పనులలో లగ్నమై ఉండి మసి అంటిన చేత్తో తాకడంవల్ల చంద్రునివలె కన్పించిన ఇల్లాలి ముఖాన్ని చూసి ఆమె భర్త ఆనందంతో నవ్వుతున్నాడు.

పత్రికలలో కాలమ్‌కి రకరకాల ప్రశ్నలు వస్తూంటాయి. "నేను ఇరవై కిలోలు లావెక్కాను. మావారు వదిలేస్తానంటున్నారు. ఏం చెయ్యను.?" "మా అమ్మాయి ముఖంమీద మొటిమలు ఎక్కువగా ఉన్నాయి. కాలేజికి వెళ్ళనంటోంది. సలహా చెప్పండి." కాలమిస్టులు తమవద్దకు ట్రీట్‌మెంట్‌కి రమ్మంటారు.

ఇలాంటి ప్రశ్నలు కాలమిస్టులే రాసుకుంటారన్న మాట కూడా విన్పిస్తూ ఉంటుంది. అది అపప్రథ కావచ్చును. నేటి యువతలో బాహ్యసౌందర్యం మీదా, ఆహార్యం మీదా కోరిక బాగా పెరిగిన మాట వాస్తవం. ఇంటి వాస్తులో మార్పులు చేసి జీవితాన్ని మార్చుకుందామనుకున్నట్లే శరీరం మీద సరైన స్థానాల్లో మచ్చలు శాశ్వతంగా పెట్టించుకుని అదృష్టాన్ని అందుకునే ప్రయత్నాలూ జరుగుతున్నాయి. ఇటీవలే ఒక చానెల్ "పుట్టుమచ్చలూ-పెట్టుమచ్చలూ" అనే కార్యక్రమం ప్రసారం చేసింది కూడా. అందానికై ఇటువంటి ప్రయత్నాలు తప్పని డాక్టర్లు హెచ్చరిస్తూనే ఉన్నారు.

ఇంతకీ అందం అన్నది అంత ముఖ్యమా? ప్రియుల ప్రేమ పొందటమే అందానికి సార్థకత అని మహాకవి కాళిదాసు ఏనాడో అన్నాడు. అందానికి ప్రయోజనం ప్రేమ పొందడమే కానీ ప్రేమ పొందడానికి అందమే కావాలా? ఎన్నో ఏళ్ళ కిందట ఇప్పటిలా గ్యాస్ స్టవ్‌లూ, మైక్రోవేవ్ ఓవెన్లూ, ఎలక్ట్రిక్ కుక్కర్లూ లేవు. ఆఖరుకు బొగ్గులు కూడా లేవు. కట్టెలంటించి, పొయ్యి మీద వంట చెయ్యాలి. పొగకి కళ్ళు మండుతూ ఉంటాయి. పొయ్యి వేడికి చెమట పడుతూ ఉంటుంది. నల్లని పొగకి గిన్నెలు మసిపడతాయి.

ఆ పరిస్థితిలో ఒక గృహిణి వంట చేస్తోంది. భర్త పొలం పనిమీద వెళ్ళాడు. ఇంకొంచెంసేపులో వంట పూర్తిచేసి, శుభ్రంగా తయారవచ్చునని ఆమె అనుకుంటూ ఉండగా భర్త తిరిగి వచ్చాడు. భర్తకి 'రూపేచ లక్ష్మి'లా కనబడాలనుకున్న ఆమె వెంటనే ముఖం తుడుచుకుంది. చేతికున్న మసి ముఖానికి అంటుకుంది.

ప్రశ్నల కాలమ్‌కి రాసుకునే స్త్రీల భర్తల వంటి వాడయితే "ఏమిటా ఏబ్రాసి ముఖం. నీట్‌గా ఉండలేవా? మా కొలీగ్ నీరజ చూడు. ఇంటి పనంతా చేసుకుని, ఆఫీసు పనిచేస్తూ ఎంత ఫ్రెష్‌గా ఉంటుందో" అనేవాడు. కానీ ఆ గృహిణి భర్త అలాఅనలేదు. మసి అంటుకున్న ఆమె ముఖం అతనికి మచ్చతో ఉన్న చందమామలా కన్పించింది. అతను ఆనందంగా చిరునవ్వు నవ్వాడు.

దాంపత్య జీవితంలో ప్రేమకి ఉదాహరణగా ఈ పద్యాన్ని చెప్పుకోవచ్చును. అందానికి కొలబద్దని ఈనాడు కాస్మెటిక్స్ కంపెనీలూ, బ్యూటీ క్లినిక్కూ, దుస్తుల, ఆభరణాల తయారీదార్లూ నిర్ణయిస్తున్నారు. బాహ్య సౌందర్యం కొంతవరకూ ముఖ్యమే కావచ్చు కానీ సర్వస్వం కాదని మగువలూ, అంత కన్నా ముఖ్యంగా మగవారూ గ్రహిస్తే మంచిది కదా.

******